

బిచ్కుంద మున్సిపాలిటీకి..
బిచ్కుంద మున్సిపాలిటీకి స్థానిక ఎమ్మెల్యే సహకారంతో రూ. 15 కోట్లు మంజూరైనట్లు కాంగ్రెస్ నాయకులు తెలిపారు.
- 9లో ▸



నిబంధనలు పట్టవు..
జిల్లాలోని కామారెడ్డి, బాన్సువాడ, ఎల్లారెడ్డి డివిజన్ల పరిధిలో పలు ప్రైవేట్ పాఠశాలలు నిబంధనలు పాటించడం లేదు.
- 8లో ▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
35.2 /23.2
ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. ఆకాశం మేఘావృతం అవుతుంది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

సాయుధ దళాల పతాక నిధికి రూ.లక్ష విరాళం



సుభాష్‌నగర్/కామారెడ్డి అర్బన్: దేశ రక్షణ కోసం తమ జీవితాలను త్యాగం చేస్తున్న భారత త్రివిధ దళాల సేవలు మరువలేనివని, వారి సంక్షేమానికి పౌరునిగా చేయూతనందిస్తూ సాయుధ దళాల పతాక నిధికి విద్యుత్ శాఖ రిటైర్డ్ ఉద్యోగి, కామారెడ్డికి చెందిన కే కృష్ణమూర్తి రూ.లక్ష విరాళం ప్రకటించారు. ఈ మేరకు నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల ప్రాంతీయ సైనిక సంక్షేమ అధికారి డీ రమేశ్‌కు ఆయన గురువారం చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా కృష్ణమూర్తి శర్మ దంపతులను శాలువాతో సత్కరించి అభినందించారు. అనంతరం అధికారి రమేశ్ మాట్లాడుతూ కృష్ణమూర్తి శర్మను స్ఫూర్తిగా తీసుకొని ఉమ్మడి జిల్లాలోని వ్యాపారులు, ప్రజలు దేశ రక్షణలో విధులు నిర్వహిస్తున్న సైనికులు, వారి కుటుంబాలకు స్వచ్ఛందంగా విరాళాలు అందించి చేయూతనందించాలని విజ్ఞప్తి చేశారు. ప్రాంతీయ సైనిక సంక్షేమ కార్యాలయ సిబ్బంది బదాం గంగామోహన్, ఉమేర్ పాల్గొన్నారు.

భూభారతితో సమస్యలకు పరిష్కారం



రామారెడ్డి: రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలు భూ భారతితో పరిష్కారమవుతాయని కామారెడ్డి ఆర్డీవో కే వీణ పేర్కొన్నారు. రామారెడ్డి మండలం కన్నా పూర్‌లో గురువారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో రామారెడ్డి తహసీల్దార్ ఉమాలతతో కలిసి ఆర్డీవో వీణ పాల్గొన్నారు. కన్నాపురం గ్రామానికి చెందిన 116 మంది రైతులు భూ సమస్యలపై ఫిర్యాదులు అందజేసినట్లు ఆర్ఐ రవికాంత్ తెలిపారు. విచారణ చేపట్టి ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తామన్నారు.

రక్తదాన శిబిరాల నిర్వహణలో జిల్లాకు అవార్డు

కామారెడ్డి క్రైం: జిల్లాలో రక్తదాన శిబిరాల నిర్వహణలో జిల్లాకు అవార్డు దక్కింది. దాతల నుంచి రక్తాన్ని సేకరించి పేదల ఆరోగ్య అవసరాలకు వినియోగించేందుకు ప్రభుత్వానికి పెద్ద మొత్తంలో బ్లడ్ యూనిట్లను అందించినందుకుగాను ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ అవార్డును ప్రకటించింది. ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా ఈనెల 14వ తేదీన హైదరాబాద్‌లో నిర్వహించనున్న కార్యక్రమంలో గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ చేతుల మీదుగా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అవార్డును అందుకోనున్నారు. జిల్లా కలెక్టర్‌తోపాటు నరేంద్ర ఆచార్య మఠ్‌సంస్థాన్ వారు సైతం అవార్డును స్వీకరించనున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కామారెడ్డి అర్బన్: జిల్లాలో మాదకద్రవ్యాల నియంత్రణ కోసం జాతీయ కార్యాచరణ ప్రణాళిక పథకం కింద డి – అడిక్షన్ సెంటర్‌ను ఏర్పాటు చేయడానికి ఆసక్తి ఉన్న స్వచ్ఛంద సంస్థల (ఎన్జీవో) నుంచి ఈనెల 30వ తేదీ వరకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సంక్షేమాధికారి ఏ ప్రమీల గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మాదకద్రవ్యాల బారిన పడిన వారిని వ్యసనాల నుంచి బయటకు తీసుకు రావడానికి కృషి చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. దరఖాస్తులను ఈ–అనుదాన్ పోర్టల్‌లో ఆన్‌లైన్ ద్వారా దాఖలు చేయాల్సి ఉంటుందని, పూర్తి వివరాలకు కలెక్టరేట్‌లోని తమ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

డైట్‌లో గెస్ట్ లెక్చరర్ పోస్టులకు..

కామారెడ్డి అర్బన్: నిజామాబాద్ డైట్ కళాశాలలో తెలుగు, ఉర్దూ, ఇంగ్లిష్ మీడియంలో బోధించేందుకు 14 అతిథి అధ్యాపక (గెస్ట్ లెక్చరర్) పోస్టుల భర్తీకి అర్హుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ టి శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. సోషియాలజీ, సైకాలజీ, సైన్స్, మ్యాథ్స్, సోషల్, తెలుగు, ఫైన్ ఆర్ట్స్, ఫిజికల్ డైరెక్టర్, సోషల్ సైన్స్ లెక్చరర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. సంబంధిత సబ్జెక్ట్‌లో పీజీ, ఎంఈడీ చేసిన 65 సంవత్సరాలలోపు వారు ఈనెల 19వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎంఈడీ లేనిపక్షంలో బీఈడీ చేసిన వారికి అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. అభ్యర్థులకు ఈనెల 24 నుంచి 26వ తేదీ వరకు మెరిట్ ప్రాతిపదికన ఇంటర్వ్యూలు నిర్వహించి నియమిస్తామని తెలిపారు. మరిన్ని వివరాలకు 94404 14198 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.



ఇన్‌చార్జీలతో నెట్టుకొస్తున్నారు!

ఉద్యోగ విరమణ చేసిన స్థానిక సంస్థల అదనపు కలెక్టర్

- జెడ్పీ సీఈవోకు ఇన్‌చార్జి బాధ్యతలు
- పదోన్నతిపై బదిలీ అయిన సీపీవో
- ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సంక్షేమ శాఖలకూ ఇన్‌చార్జీలే..
- మరికొన్ని శాఖలదీ అదే పరిస్థితి

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : జిల్లాలో వివిధ శాఖలకు సంబంధించి జిల్లా అధికారులుగా ఇన్‌చార్జీలు కొనసాగుతున్నారు. కీలకమైన పలు విభాగాలకు సైతం రెగ్యులర్ అధికారులు లేకపోవడం పాలనకు ఆటంకంగా మారుతోంది. ప్రభుత్వ పథకాల అమలు.. వాటి ఫలాలు లబ్ధిదారులకు అందేలా చూడడం, అభివృద్ధి పనుల పర్యవేక్షణ వంటి పనులన్నీ ఆయా శాఖల జిల్లా అధికారుల ఆధ్వర్యంలో జరుగుతాయి. అయితే చాలా శాఖలకు రెగ్యులర్ అధికారులు లేకపోవడంతో ఇన్‌చార్జీలతో నెట్టుకొస్తున్నారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతోపాటు విద్య, వైద్యం వంటి కీలక శాఖలను చూసుకోవాల్సిన చాలా విభాగాలకు రెగ్యులర్ అధికారులు లేకపోవడం పాలనకు ఆటంకంగా మారింది. రెగ్యులర్ అధికారులైతే మంచైనా, చెడైనా భరించే పరిస్థితి ఉంటుంది. ఇన్‌చార్జి అధికారులు ఏ చిన్న సమస్య ఎదురైనా ఈ బాధ్యతలు తమకు వద్దంటూ తప్పుకుంటుంటారు. గతంలో కొంత కాలం అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పోస్టు ఖాళీగా ఉండి ఇన్‌చార్జితో కొనసాగించారు. ఇప్పుడు అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) కూడా అదే పరిస్థితి ఉంది. అలాగే ఇంజినీరింగ్ విభాగాలకు సంబంధించి వివిధ శాఖల్లో రెగ్యులర్ అధికారులు లేరు. జిల్లాలో రెగ్యులర్ అధికారులను నియమించే విషయంలో జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు చొరవ చూపాల్సిన అవసరం ఉంది.

ఎల్లారెడ్డి ఆర్డీవో కూడా..

భూభారతి అమలవుతున్న సమయంలో ఎల్లారెడ్డి ఆర్డీవో పోస్టు ఖాళీ అయ్యింది. ఆర్డీవో మన్నె ప్రభాకర్ ఇటీవల ఉద్యోగ విరమణ చేశారు. దీంతో బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయికి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు.

డీఎంహెచ్‌వో..

జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి పోస్టు చాలా కాలంగా ఖాళీగా ఉండగా, డిప్యూటీ డీఎంహెచ్‌వో చంద్రశేఖర్‌కు ఇన్‌చార్జిగా బాధ్యలు ఇచ్చారు. రెగ్యులర్ అధికారులు రావడం లేదు. గతంలో పనిచేసిన ఓ అధికారి వివాదాల్లో ఇరుక్కుని సస్పెన్షన్‌కు గురయ్యారు. తరువాత చంద్రశేఖర్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించగా ఆయనే జిల్లా బాధ్యతలు మోస్తున్నారు.

ఇన్‌చార్జి అదనపు కలెక్టర్

స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డి.శ్రీనివాస్‌రెడ్డి ఉద్యోగ విరమణ చేసిన తరువాత రెగ్యులర్ అధికారిని నియమించలేదు. దీంతో జెడ్పీ సీఈవో చందర్‌నాయక్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. జిల్లాలో స్థానిక సంస్థలకు సంబంధించిన అన్ని వ్యవహారాలను అదనపు కలెక్టర్ పర్యవేక్షించాల్సి ఉంటుంది. మున్సిపాలిటీల పాలక వర్గాలు లేకపోవడతో అదనపు కలెక్టర్ ప్రత్యేకాధికారిగా ఉన్నారు. అలాగే పంచాయతీల పాలక వర్గాలు లేక పాలన గాడి తప్పింది. పంచాయతీల్లో నిధుల సమస్యతో కార్యదర్శులు అప్పుల పాలయ్యారు. బిల్లులు రాకపోవడంతో వారంతా ఇబ్బందులు పడుతున్నారు. చాలా మంది సెలవుపై వెళ్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో అదనపు కలెక్టర్ లేకపోవడం విస్మయం కలిగిస్తోంది.

జిల్లా ఎస్సీ సంక్షేమ అధికారి రజిత పదోన్నతిపై నిజామాబాద్‌కు బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో ఏఎస్సీడబ్ల్యూవో వెంకటేశ్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. ఎస్టీ సంక్షేమ అధికారి పోస్టు ఖాళీగా ఉండగా, భూగర్భజల శాఖ

సంక్షేమ శాఖలకు..

అధికారి సతీశ్‌యాదవ్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు ఇచ్చారు. మైనారిటీ సంక్షేమ అధికారి పోస్టు చాలా కాలంగా ఖాళీగా ఉండగా, ఎస్సీ అభివృద్ధి శాఖ అధికారి దయానంద్ ఇన్‌చార్జి బాధ్యతలు మోస్తున్నారు.

జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి (సీపీవో) రాజారాం పదోన్నతిపై ఇటీవలే బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో రాష్ట్ర కార్యాలయంలో పనిచేసే మహిళా అధి

సీపీవో ఇన్‌చార్జినే..

కారికి పోస్టింగ్ ఇచ్చినా ఆమె రాకపోవడంతో స్థానిక కార్యాలయంలో పనిచేసే ఏసీపీవో శివకుమార్‌కు ఇన్‌చార్జిగా బాధ్యతలు అప్పగించారు. కలెక్టరేట్‌లో సీపీవో పోస్టు కీలకమైనది.

ప్రభుత్వ కార్యక్రమాలకు సంబంధించి మీడియా కవరేజీ వ్యవహారాలను చూసే జిల్లా సమాచార పౌరసంబంధాల శాఖ అధికారి పోస్టు ఖాళీగా ఉంది.

ఇక్కడ పనిచేసిన డీపీఆర్‌వో భీంకుమార్

సమాచార శాఖదీ అదే పరిస్థితి

ఉద్యోగ విరమణ చేయగా, సిద్దిపేట డీపీఆర్‌వో రవికుమార్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు.

సాగర్ కింద సాగుకు సన్నద్ధం



ఆయకట్టు కింద నారుమడి

- ఆశాజనకంగా నిజాంసాగర్ నీటిమట్టం
- పంటల సాగుకు భరోసా లభించిందంటున్న రైతులు
- 1.5 లక్షల ఎకరాల ఆయకట్టుకు అందనున్న నీరు

నిజాంసాగర్: ఉమ్మడి జిల్లా వరప్రదాయని నిజాంసాగర్ ప్రాజెక్టులో నీటి నిల్వ ఆశాజనకంగా ఉంది. వానాకాలం పంటల సాగుకు సన్నద్ధమవుతున్న రైతులకు భరోసా ఏర్పడింది. ఈ ఏడాది వర్షాకాలం ప్రారంభానికి ముందే ప్రాజెక్టులో 5 టీఎంసీలకు పైగా నీరు నిల్వ ఉంది. దీంతో సుమారు నెల రోజులముందే పంటల సాగుకు ఆయకట్టు ప్రాంత రైతులు సన్నద్ధమవుతున్నారు. ప్రాజెక్టు కింద 2.5 లక్షల ఎకరాలకుపైగా ఆయకట్టు ఉంది. అయితే అలీసాగర్ రిజర్వాయర్ వరకు 1.5 లక్షల ఎకరాల ఆయకట్టుకు మాత్రం నిజాంసాగర్ ప్రాజెక్టు నీరందుతుంది. మిగతా ఆయకట్టుకు గుత్ప, అర్గుల్ రాజారాం ఎత్తిపోతల ద్వారా సాగు నీరు అందుతుంది. కామారెడ్డి జిల్లాలో నిజాంసాగర్, మహమ్మద్‌నగర్, బాన్సువాడ, బీర్కూర్, నస్రుల్లాబాద్ మండలాల పరిధిలోని డిస్ట్రిబ్యూటరీ 26 వరకు 33 వేల ఎకరాల ఆయకట్టు ఉండగా, మిగతా ఆయకట్టు నిజామాబాద్ జిల్లా పరిధిలో ఉంది. మొదటి ఆయకట్టుతోపాటు డిస్ట్రిబ్యూటరీ 49 వరకు నిజాంసాగర్ ప్రాజెక్టు నీటిని అందిస్తున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టులో నీటి నిల్వ ఆశాజనకంగా ఉండటంతో బాన్సువాడ, బీర్కూర్, నస్రుల్లాబాద్, వర్ని, రుద్రూర్, కొటగిరి, ఎడపల్లి, నవీపేట మండలాల్లోని రైతులు నారుమళ్లను సిద్ధం చేసుకున్నారు. ఒక్క నిజాంసాగర్, మహమ్మద్‌నగర్ మండలాల రైతులు నారుమళ్లకు ఆలస్యం చేస్తున్నారు. మొదటి ఆయకట్టు ప్రాంతం కావడంతోపాటు బోరుబావులు లేక ప్రధాన కాలువపైన ఆధారపడ్డారు. ప్రధాన కాలువకు నీటి విడుదల చేపట్టకపోవడంతో మొదటి ఆయకట్టు ప్రాంత రైతులు నారుమళ్లు వేయడం ఆలస్యమవుతోంది. ప్రాజెక్టు ఆయకట్టు కింద పంటల సాగుకు సన్నద్ధమైన రైతులను భూముల దుక్కితోపాటు నారుమళ్లకు వర్షాలు ఆదుకున్నాయి.

స్వల్ప ఇన్‌ఫ్లో



నిజాంసాగర్ ప్రాజెక్టులో నీటిమట్టం

నిజాంసాగర్(జుక్కల్): ఎగువ ప్రాంతాల్లో వర్షాలు కురుస్తుండడంతో నిజాంసాగర్ ప్రాజెక్టులోకి 590 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 1405 అడుగులు (17.8 టీఎంసీలు) కాగా, ప్రస్తుతం 1393.5 అడుగుల (5.9 టీఎంసీలు) నీరు నిల్వ ఉందన్నారు.

నారుమళ్లు వేసుకుంటున్నాం



నిజాంసాగర్ ఆయకట్టు కింద భూములను దుక్కి చేసి నారుమళ్లకు సిద్ధం చేసుకుంటున్నాం. వారం కిందట కురిసిన వర్షం భూములకు మేలు చేసింది. నారుమళ్లు వేసుకొని పంటల సాగుకు ముందుకు వెళ్తున్నాం.

– కుమ్మరి రాములు, రైతు, తుంకిపల్లి

ప్రధాన కాలువ ఆధారం



ప్రాజెక్టు ప్రధాన కాలువ ద్వారా నీటిని విడుదల చేస్తేనే నారుమళ్లు, నాట్లకు ముందుకు వెళ్తాం. ప్రధాన కాలువకు లీకేజీ నీటిని విడుదల చేస్తే నారుమళ్లకు ఉపయోగకరంగా ఉంటుంది. ముందస్తు పంటల సాగుకు రైతులను అధికారులు ప్రోత్సహించాలి.

– విఠల్‌గౌడ్, యువ రైతు, కొమలంచ

మొదటి రోజు హుషారుగా



జిల్లా కేంద్రంలోని గంజ్ స్కూల్‌లో ప్రార్థన చేస్తున్న విద్యార్థులు

- పునఃప్రారంభమైన పాఠశాలలు
- జిల్లా వ్యాప్తంగా 50శాతం విద్యార్థులే హాజరు

కామారెడ్డి టౌన్: జిల్లా వ్యాప్తంగా గురువారం పాఠశాలలు పునఃప్రారంభమయ్యాయి. తొలి రోజు విద్యార్థులకు స్వాగతం పలికేందుకు ఉపాధ్యాయులు అన్ని ఏర్పాట్లు చేశారు. హాజరైన విద్యార్థులకు పుస్తకాలు, ఏకరూప దుస్తులను పంపిణీ చేశారు.

మొదటి రోజు జిల్లా వ్యాప్తంగా సుమారు 50 శాతం విద్యార్థులు హాజరైనట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు. 1040 పాఠశాలల్లో సుమారు 35వేలకు పైగా విద్యార్థులు హాజరైనట్లు పేర్కొన్నారు. బడిబాట కార్యక్రమం, అడ్మిషన్ల ప్రక్రియ కొనసాగుతోందని డీఈవో ఎస్ రాజు తెలిపారు.

బాధ్యతతో పని చేయాలి

- ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు పురోగతిలో ఉండాలి
- వార్డు ఆఫీసర్లు, ఇన్‌చార్జీలు వార్డుల్లో పర్యటించాలి
- వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్



అధికారులతో ఫోన్‌లో మాట్లాడుతున్న పోచారం

బాన్సువాడ : మున్సిపాలిటీ పరిధిలోని వార్డు ఆఫీసర్లు, వార్డు ఇన్‌చార్జీలు బాధ్యతతో పని చేయాలని, వార్డుల్లో పర్యటిస్తూ ఇందిరమ్మ ఇళ్ల పనులు పురోగతిలో ఉండేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బాన్సువాడ మున్సిపల్ కార్యాలయంలో వార్డు ఆఫీసర్లు, ఇందిరమ్మ కమిటీ సభ్యులతో ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్ గురువారం సమీక్షాసమావేశం నిర్వహించి వార్డుల వారీగా ఇళ్ల నిర్మాణ పనుల పురోగతిపై ఆరా తీశారు. పోచారం శ్రీనివాస్‌రెడ్డి హైదరాబాద్ నుంచి ఫోన్‌లో అధికారులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులతో మాట్లాడారు. బాన్సువాడ పట్టణానికి మొదటి విడతలో 260 ఇందిరమ్మ ఇళ్లు మంజురయ్యాయని, వార్డుల వారీగా ఏ వార్డులో ఎన్ని ప్రారంభించారో, ఎన్ని బెస్మిట్ వరకు వచ్చాయనే విషయాలు వార్డు ఆఫీసర్లు, ఇన్‌చార్జీలకు తెలుసని, ప్రతి ఒక్క లబ్ధిదారుని కలిసి ఇల్లు నిర్మించుకునేలా ప్రొత్సాహించాలని అన్నారు. ఇంటి నిర్మాణానికి అవసరమయ్యే ఇసుక రాష్ట్రంలోనే మన నియోజకవర్గంలో అతి తక్కువ ధరకు అందుబాటులో ఉండేలా ఏర్పాటు చేశామన్నారు. నియోజకవర్గంలోని బీర్కూర్, కిష్టాపూర్, చింబోల్లి, దామరంచ క్వారీల్లో ఇసుక అందుబాటులో ఉందని, ఒక్క ఇంటి నిర్మాణానికి 20 ట్రాక్టర్ల ఇసుక అవసరమవుతుందని, వర్షాకాలం దృష్ట్యా సరిపడా ఇసుకను సొంత స్థలాల్లో డంపు చేసుకోవాలని సూచించారు. ఇప్పటి వరకు బాన్సువాడ పట్టణంలో 2500 డబుల్ బెడ్ రూం ఇళ్లు నిర్మించి ఇచ్చామని, ఇప్పుడు ఇందిరమ్మ పథకం ద్వారా స్థలం ఉన్న వారికి 260 ఇళ్లు మంజురు చేశామని, స్థలాలు లేని వారి వివరాలు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి త్వరలో మంజురయ్యేలా చూస్తానని పోచారం అన్నారు. రెండు, మూడు రోజుల్లో బాన్సువాడకు వచ్చి వార్డు ఆఫీసర్లు, ఇన్‌చార్జీల పనితీరును పర్యవేక్షిస్తానని అన్నారు. మున్సిపల్ మాజీ చైర్మన్ జంగం గంగాధర్, కమిషనర్ శ్రీహరిరాజు, నాయకులు కృష్ణారెడ్డి, అంజిరెడ్డి, ఎజాస్, అసద్, సురేశ్, నార్ల రవీందర్, మాసాని శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించాలి

- పిల్లలతో పని చేయిస్తే వారి ఆరోగ్యం, భవిష్యత్ నాశనం అవుతాయి
- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, అధికారులు

కామారెడ్డి క్రైం: బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. ప్రపంచ బాల కార్మిక నిరోధక దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం తన చాంబర్‌లో వాల్ పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తల్లిదండ్రులు చిన్నతనంలోనే తమ పిల్లలను పనికి పంపిస్తే వారి ఆరోగ్యం, భవిష్యత్ నాశనం అవుతాయని, బాలలు తప్పనిసరిగా పాఠశాలల్లో ఉండాలన్నారు. బాల కార్మికులను గుర్తించే విషయంలో గ్రామ, వార్డు వలంటీర్లు, పంచాయతీ సిబ్బంది బాధ్యతగా వ్యవహరించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారిణి ప్రమీల, సూపరింటెండెంట్ విజయభాస్కర్, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ కోటేశ్వర్లు, డీసీపీవో స్రవంతి, సాధన కో ఆర్డినేటర్ గిరిజ, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య..

సదాశివనగర్(ఎల్లారెడ్డి): ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య లభిస్తుందని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. మండలంలోని అడ్లూర్ ఎల్లారెడ్డి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ఆయన గురువారం దుస్తులు పంపిణీ చేశారు. పాఠశాల అభివృద్ధికి కృషి చేసిన ప్రముఖ సైంటిస్ట్ పైడి ఎల్లారెడ్డి ఆధ్వర్యంలో దుస్తులను అందజేశారు. డీఈవో రాజు, మండల ప్రత్యేకాధికారి సతీశ్‌యాదవ్, ఎంపీడీవో సంతోష్ కుమార్, తహసీల్దార్ సత్యనారాయణ, ఎంఈవో యోసెఫ్, డీపీఎం రమేశ్‌బాబు, ఏపీఎం రాజురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రెండు స్కూల్ బస్సులు సీజ్

కామారెడ్డి క్రైం: నిబంధనలకు విరుద్ధంగా రోడ్లపై తిరుగుతున్న రెండు పాఠశాలల బస్సులను సీజ్ చేసినట్లు డీటీవో శ్రీనివాస్‌రెడ్డి గురువారం తెలిపారు. జిల్లా కేంద్రంతోపాటు పరిసర ప్రాంతాల్లో బస్సుల ఫిట్‌నెస్ విషయంతో ప్రత్యేక తనిఖీలు చేపట్టామని, నిబంధనలకు విరుద్ధంగా తిరుగుతున్న రెండు బస్సులను సీజ్ చేయడంతోపాటు మరో నాలుగు పాఠశాలల బస్సులకు జరిమానాలు విధించినట్లు తెలిపారు. తనిఖీల్లో ఎంవీఐలు, ఏఎంవీఐలు, సిబ్బంది పాల్గొన్నారు.



జిల్లా కేంద్రంలో పాఠశాల బస్సును తనిఖీ చేస్తున్న రవాణాశాఖ అధికారులు

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న న్యాయమూర్తి వరప్రసాద్

కామారెడ్డి టౌన్: ఈనెల 14వ తేదీన నిర్వహించనున్న జాతీయ లోక్‌అదాలత్‌లో వీలైనన్ని కేసుల పరిష్కారానికి కృషి చేయాలని, కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి వరప్రసాద్ అన్నారు. కోర్టు భవనంలో న్యాయవాదులతో గురువారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. కాంపౌండబుల్, క్రిమినల్, సివిల్ తదితర కేసులు పరిష్కారం అయ్యేలా ఇరు వర్గాలతో రాజీ కుదుర్చాలని అన్నారు. సమావేశంలో సీనియర్ సివిల్ జడ్జి సుమలత, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి నాగరాణి, జూనియర్ సివిల్ జడ్జి కే సుధాకర్, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి దీక్ష, కామారెడ్డి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నంద రమేశ్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాజ్‌గోపాల్‌గౌడ్, ఏజీపీ షబానా, న్యాయవాదులు పాల్గొన్నారు.

పోస్టర్ల ఆవిష్కరణ

జిల్లాలోని ఏడు బెంచీలతో లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు న్యాయమూర్తి, న్యాయసేవాధికార సంస్థ జిల్లా చైర్మన్ వరప్రసాద్ తెలిపారు. గురువారం సాయంత్రం తన చాంబర్‌లో న్యాయమూర్తులతో కలిసి పోస్టర్లను ఆవిష్కరించారు. న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి నాగరాణి, న్యాయమూర్తులు సుమలత, సుధాకర్, దీక్ష, సూపరింటెండెంట్ చంద్రసేన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బీజేపీ పాలనలో దేశం ఎంతో అభివృద్ధి



ఎల్లారెడ్డిలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షులు నీలం చిన్న రాజులు

ఎల్లారెడ్డి: కేంద్రంలో 11ఏళ్ల బీజేపీ పాలనలో దేశం ఎంతో అభివృద్ధి చెందిందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నీలం చిన్నరాజులు అన్నారు. ఎల్లారెడ్డిలో గురువారం కేంద్రంలో బీజేపీ పాలన పదకొండేళ్లు పూర్తయిన సందర్భంగా ఆయన మొక్కలను నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బీజేపీ పాలనలో దేశంలోని ప్రజలు సుఖశాంతులతో ఉన్నారన్నారు. అనంతరం ఎల్లారెడ్డి పట్టణ బీజేపీ కార్యవర్గాన్ని ప్రకటించి, నూతన కార్యవర్గాన్ని సన్మానించారు. పట్టణ అధ్యక్షుడిగా రాజేష్, ఉపాధ్యక్షుడిగా కాశీనాథ్, పులి రమేష్, అల్లం స్వరూప, పోచయ్య, కార్యదర్శులుగా శంకర్, శ్రీను, సహాయ కార్యదర్శులుగా శివకుమార్, రమేష్, పద్మ, పండరి, కోశాధికారిగా గజానంద్‌ను ఎన్నుకున్నట్లు తెలిపారు.

మున్సిపల్ పార్కు ప్రారంభం



పార్కును ప్రారంభిస్తున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రం పరిధిలోని టేక్రియాల్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన మున్సిపల్ చిల్డ్రన్ పార్కును గురువారం కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ప్రారంభించారు. ఈ ప్రాంత పిల్లలు ఆడుకునేందుకు వీలుగా ఈ పార్కును ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. మున్సిపల్ కమిషనర్ రాజేందర్‌రెడ్డి, ఏఈ శంకర్, వార్డు ఆఫీసర్ దీప్తి, సానిటరీ ఎస్‌ఐ పర్వేజ్ తదితరులున్నారు.

పెండింగ్ కేసులను పరిష్కరించాలి



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): నాగిరెడ్డిపేట స్టేషన్ పరిధిలో ఉన్న పెండింగ్ కేసులను వెంటనే పరిష్కరించాలని ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాస్‌రావు సూచించారు. నాగిరెడ్డిపేట పోలీస్టేషన్‌ను గురువారం ఆయన తనిఖీ చేశారు. స్టేషన్ పరిధిలో గల పెండింగ్ కేసులపై సమీక్షించారు. అనంతరం సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఎల్లారెడ్డి సీఐ రవీందర్‌నాయక్, నాగిరెడ్డిపేట ఎస్సై మల్లారెడ్డి తదితరులున్నారు.

ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి



మాట్లాడుతున్న హన్మంత్‌రెడ్డి

కామారెడ్డి టౌన్: ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని స్టేట్ టీచర్స్ యూనియన్ తెలంగాణ స్టేట్(ఎస్‌టీయూటీఎస్) జిల్లా అధ్యక్షుడు హన్మంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్ దేవునిపల్లిలో గురువారం నిర్వహించిన యూనియన్ జిల్లా కార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. యూనియన్ సభ్యులు కుంట రాములు, ప్రవీణ్‌కుమార్, రాజేందర్, యూసుఫ్, కలీబుద్దిన్ తదితరులున్నారు.

విద్యుత్ షాక్‌తో దూడ మృతి

ఎల్లారెడ్డి రూరల్: మండలంలోని మల్లయ్యపల్లిలో విద్యుత్ షాక్‌తో లేగ దూడ మృతి చెందినట్లు బాధితుడు గడ్డం లక్ష్మీకాంతం గురువారం తెలిపారు. బలంగా వీచిన ఈదురు గాలులకు విద్యుత్ తీగలు తెగి పడడంతో మేత మేస్తున్న లేగ దూడకు విద్యుత్ షాక్ తగిలి మరణించిందన్నారు. విద్యుత్ శాఖ అధికారులు నష్టపరిహారం అందేలా చూడాలని కోరారు.

నిబంధనలు పట్టవు.. తీరు మారదు..

- జిల్లాలో ప్రైవేట్ పాఠశాలల ఇష్టారాజ్యం
- అధిక ఫీజు వసూళ్లు
- అపార్ట్‌మెంట్‌లు, నివాస గృహాల్లో స్కూల్‌ల నిర్వహణ



విద్యానగర్ కాలనీ ప్రధాన రోడ్డు పక్కన అపార్ట్‌మెంట్‌లో కొనసాగుతున్న పాఠశాల

కామారెడ్డి టౌన్: జిల్లాలోని కామారెడ్డి, బాన్సువాడ, ఎల్లారెడ్డి డివిజన్‌ల పరిధిలో పలు ప్రైవేట్ పాఠశాలలు ప్రభుత్వ నిబంధనలను పాటించడం లేదు. పర్యవేక్షణ, క్షేత్రస్థాయి పరిశీలన చేయాల్సిన విద్యాశాఖ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండడంతో కొందరు గల్లీలో, అపార్ట్‌మెంట్‌లలో, గృహాల్లో బడులను నెలకొల్పుతూ విద్యను వ్యాపారంగా మార్చుతున్నారు. అనుమతులు రాక ముందే కొన్ని ప్రారంభిస్తున్నారు. విద్యాశాఖ సమయసారిణి విస్మరిస్తూ తరగతులు కొనసాగిస్తున్నరనే విమర్శలు ఉన్నాయి. అయినా అధికారులు అటువైపు చూడకపోవడం, తనిఖీలు చేయకపోవడంపై అనుమానాలు తలెత్తున్నాయి.

కనిపించని కనీస ప్రమాణాలు

పాఠశాలలు ఏర్పాటు చేయాలంటే అనుమతి తప్పనిసరి. ఏ పేరుతో అనుమతి తీసుకుంటారో దానినే బోర్డు, కరపత్రాలపై ముద్రించాలి. టెక్నో, ఈ టెక్నో, ప్రైమ్, టాలెంట్ లాంటి తోక పేర్లను జోడించవద్దని నిబంధనలు ఉన్నా జోడించి మరి ప్రచారం చేయడంతోపాటు బోర్డులపై ఏర్పాటు చేస్తున్నారు. గాలి, వెలుతురు వచ్చేలా విశాలమైన తరగతి గదులు, పిల్లలు కూర్చునేందుకు వీలుగా బెంచీలు, క్రీడల కోసం మైదానాలు, అగ్నిమాపక శాఖ అనుమతి, అగ్నిమాపక పరికరాలు, తదితర సౌకర్యాలు కల్పించాలి. కానీ కొన్ని స్కూల్స్‌లలో కనీస ప్రమాణాలు పాటించడం లేదు. ఇరుకైన గదులు, దుకాణ, ఇళ్ల సముదాయాలు వంటి వాటిలో తరగతులు నిర్వహిస్తున్నారు. మైదానాలు వేరే చోటు లీజుకు తీసుకుంటున్నట్లు చూపిస్తున్నారు. జిల్లాలో అధికారికంగా ప్రైవేట్ స్కూళ్లు సుమారు 200కు పైగా ఉండగా, అనధికారికంగా మరో 40కిపైగా ఉంటాయి. తాజాగా జిల్లా కేంద్రంలోనే 7 పాఠశాలలకు అనుమతులు

- జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయం ముందు ఓ కార్పొరేట్ స్కూల్ అపార్ట్‌మెంట్‌లో కొనసాగుతుంది. పార్కింగ్ స్థలం, క్రీడా మైదానం అసలే లేదు. ఇరుకు గదుల్లో వందల సంఖ్యలో విద్యార్థులను కూర్చోబెడుతారు.
- విద్యానగర్ కాలనీలోగల అపార్ట్‌మెంట్‌లో ఒకటి, బహుళ అంతస్తు భవనంలో మరొకటి నిబంధనలకు విరుద్ధంగా స్కూళ్లు కొనసాగుతున్నాయి. ఇరుకు గదులు, ఫైర్ సెఫ్టీ లేకుండా, మైదానం, పార్కింగ్ స్థలం కనీస ప్రమాణాలు పాటించకుండా స్కూల్స్ కొనసాగిస్తున్నారు.
- గోదాం రోడ్‌లో ప్రభుత్వ గోదాంల పక్కన నాలుగు అంతస్తుల ఇరుకు భవనంలో ఓ స్కూల్ నిర్వహిస్తున్నారు. ప్రమాదవశాత్తు ఏమైనా ప్రమాదం జరిగితే కనీసం బైక్ వెళ్లడానికి వీలులేకుండా సెట్‌బ్యాక్ కూడా లేదు. పార్కింగ్, మైదానానికి గజం స్థలం కూడా లేదు.
- గాంధీనగర్, దేశాయిబ్రదర్స్ వెనకాల, పెద్ద బజార్, ఎన్జీవోస్ కాలనీ, అశోక్‌నగర్ కాలనీ, కలెక్టరేట్‌కు కూత వేటు దూరం భవానీనగర్‌లో గృహ నిర్మాణ భవనాల్లో నిబంధనలకు విరుద్ధంగా కనీస ప్రమాణాలు పాటించకుండా స్కూళ్లు కొనసాగుతున్నాయి.



జిల్లా కేంద్రంలో మున్సిపల్ కార్యాలయం ఎదుట మైదానం లేకుండా రోడ్డు పక్కనే నిర్వహిస్తున్న స్కూల్

లేవని తల్లిదండ్రులు గమనించాలని డీఈవోనే ప్రకటన విడుదల చేశారు. గుర్తింపులేని బడుల్లో చదివితే ధ్రువపత్రాలు లభించక విద్యార్థులు భవిష్యత్‌లో ఇబ్బందులు పడే పరిస్థితులుంటాయి.

ప్రత్యేక కోర్సుల పేరిట ఫీజులు

జిల్లాలో ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు ఇష్టారీతిన ఫీజులు వసూళ్లు చేస్తున్నాయనే విమర్శలున్నాయి. కేవలం నర్సరీ, ఒకటోతరగతి పిల్లలకే ఏడాదికి రూ. 50వేలకు పైగా వసూళ్లు చేస్తున్నారు. అడ్మిషన్, ట్యూషన్, కంప్యూటర్, ఐఐటీ, అబాకస్ తదితర కోర్సుల పేరిట అధనంగా దండుకుంటున్నారు. జిల్లా స్థాయిలో ఫీజుల నియంత్రణ కమిటీ ఊసే లేదు. యూనిఫాం, ప్రత్యేకంగా ఒక రోజు మరో జత, రెండు రకాల బూట్లు, బెల్టు, టై, నోట్, పాఠ్య పుస్తకాలు తమకు అనుసంధానంగా ఉన్న స్టాల్‌లోనే కొనుగోలు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులకు హుకుం జారీ చేస్తున్నారు. దీంతో తల్లిదండ్రులపై తీవ్ర ఆర్థికభారం పడుతోంది. ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు పర్యవేక్షణ చేపడితే పిల్లలకు, తల్లిదండ్రులకు మేలుజరుగుతుందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

నిబంధనలు పాటించకుంటే చర్యలు



ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు విద్యాశాఖ నిబంధనలను పాటించకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. నిబంధనల మేరకు మౌలిక సదుపాయాలు కల్పించాలి. క్రీడామైదానాలు ఏర్పాటు చేసుకోవాలి. విద్యార్థుల నుంచి అధిక ఫీజులు వసూలు చేయవద్దు. స్కూల్‌లో బుక్స్, యూనిఫాం తదితర సామగ్రి విక్రయాలు చేస్తే సీజ్ చేస్తాం. తల్లిదండ్రుల నుంచి ఫిర్యాదులు వస్తే విచారణ చేసి చర్యలు తీసుకుంటాం.

–ఎస్.రాజు, డీఈవో, కామారెడ్డి

రాళ్ల గుట్టపై.. నీళ్ల బావి

మీకు తెలుసా?



ఆర్మూర్ పట్టణంలోని నల్లని రాళ్లతో సహజ సిద్ధంగా ఏర్పడిన నవనాథ సిద్దుల గుట్టపై తాగునీటి అవసరాలు తీర్చే చేద బావిలో నీళ్లు, కోనేరులో ఊట ద్వారా వచ్చే నీళ్లు భక్తులకు సంభ్రమాశ్చర్యాలను కలిగిస్తాయి.

- సాగు అవసరాల కోసం వందల ఫీట్లు బోరు బావులు తవ్వే ఈ ప్రాంతంలో రాళ్ల గుట్టపై ఊట లేదా వర్షం ద్వారా నీళ్లు ఆశ్చర్యానికి గురిచేస్తాయి.
- ఎత్తయిన రాళ్ల గుట్టపై నిత్యం నీరుండేలా కోనేరును ఉంది.
- రామాలయం ఎదురుగా తవ్విన బావిలో ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో సైతం నిత్యం నీళ్లు అందుబాటులో ఉండి ఆశ్చర్యాన్ని కలిగిస్తాయి.
- వందల ఏళ్ల క్రితం నవనాథులు గుట్టపై తపస్సు చేసుకొంటూ సిద్ధేశ్వరుడిని కొలిచే కాలంలో ఈ చేద బావి, కోనేరును నిర్మించినట్లు స్థల పురాణం ద్వారా తెలుస్తోంది.

– ఆర్మూర్

ముగిసిన పోలీసు బదిలీలు

- క్రమశిక్షణతో విధులు నిర్వర్తించాలన్న ఎస్పీ రాజేశ్‌చంద్ర



మాట్లాడుతున్న ఎస్పీ రాజేశ్ చంద్ర

కామారెడ్డి క్రైం: జిల్లా పోలీసు శాఖలో బదిలీల ప్రక్రియ ముగిసింది. జిల్లాలోని మూడు పోలీసు సబ్ డివిజన్‌ల పరిధిలో పని చేస్తున్న సివిల్ హెడ్ కానిస్టేబుళ్లు, ఏఎస్సైల బదిలీలను జిల్లా పోలీసు కార్యాలయంలో నాలుగు రోజులపాటు చేపట్టారు. గురువారం నిర్వహించిన సమావేశంలో ఎస్పీ రాజేశ్‌చంద్ర మాట్లాడుతూ.. నాలుగు సంవత్సరాల సర్వీస్ పూర్తిచేసిన హెడ్‌కానిస్టేబుళ్లు, మూడు సంవత్సరాల సర్వీస్ పూర్తి చేసిన ఏఎస్సైల బదిలీల్లో భాగంగా విల్లింగ్ స్టేషన్లు, సీనియారిటీ, దంపతుల సేవలు (స్పౌస్), ఆరోగ్య పరిస్థితులు, సర్వీస్ రికార్డులు తదితర అంశాలను పరిగణనలోకి తీసుకున్నామని తెలిపారు. ప్రతి పోలీసు అధికారి క్రమశిక్షణతో మెలగాలని, నిబద్ధత, నిజాయితీతో వ్యవహరించాలని సూచించారు. ఎప్పటికప్పుడు తమ నైపుణ్యాలను మెరుగుపరచుకుంటూ బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలన్నారు. అప్పుడే పోలీస్ శాఖపై ప్రజల్లో విశ్వాసం బలపడుతుందని పేర్కొన్నారు. అదనపు ఎస్పీ నరసింహారెడ్డి, ఏఆర్ డీఎస్పీ యాకూబ్‌రెడ్డి, ఎస్బీ సీఐ తిరుపయ్య, ఆర్‌ఐలు నవీన్‌కుమార్, కృష్ణ, అధికారులు పాల్గొన్నారు.

పంటమార్పిడితో సుస్థిర ఆదాయం



మాట్లాడుతున్న ఏరువాకకేంద్రం శాస్త్రవేత్త అనిల్

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): పంటమార్పిడి ప్రక్రియ చేపట్టడం వల్ల రైతులు సుస్థిర ఆదాయం పొందవచ్చని మండలంలోని మాల్తుమ్మెద ఏరువాకకేంద్రం శాస్త్రవేత్తలు అనిల్‌రెడ్డి, రేవంత్ అన్నారు. మండలంలోని పోచారం గ్రామంలో గురువారం రైతు ముగింట్లో శాస్త్రవేత్తలు అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తక్కువ యూరియా వాడడం వల్ల సాగు ఖర్చు తగ్గించుకోవచ్చన్నారు. అవసరం మేరకు రసాయనాలను వినియోగించి నేలతల్లి ఆరోగ్యాన్ని కాపాడాలన్నారు. విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు కొనుగోలు చేసిన రశీదులను రైతులు భద్రపర్చుకోవాలని, కష్టకాలంలో నష్టపరిహారాన్ని పొందవచ్చని పేర్కొన్నారు. ఏవో సాయికిరణ్, హెచ్‌వో కమలాకర్‌రెడ్డి, హిందూస్థాన్ యూనిలివర్ జనరల్ మేనేజర్ అశోక్, ఫీల్డ్‌ఆఫీసర్ పరమేశ్వర్ రెడ్డి, మాల్తుమ్మెద సొసైటీ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కబ్జా నుంచి చెరువును కాపాడండి



నేరల్ వద్ద ఎమ్మెల్యే మదన్‌మోహన్‌కు సమస్యలను విన్నవిస్తున్న నాగ్లూర్ గ్రామస్తులు

గాంధారి(ఎల్లారెడ్డి): కబ్జాకు గురవుతున్న నాగ్లూర్ చెరువును కాపాడాలని గ్రామస్తులు కోరారు. ఈమేరకు వారు గురువారం మండలంలో పర్యటించిన ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌కు సమస్యను విన్నవించారు. చెరువు నుంచి నల్లమట్టిని అక్రమంగా తరలిస్తూ చెరువును కబ్జా చేస్తున్నారని అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఎమ్మెల్యే స్పందించి, సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యేకు మండల పరిధిలోని కారోబార్లు, పారిశుద్ధ్య కార్మికులు పెండింగ్ వేతనాలు ఇప్పించాలని కోరుతూ వినతిపత్రం ఇచ్చారు. అధికారులతో మాట్లాడి వేతనాలు ఇప్పిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కారోబార్లు పండరి, శ్రావణ్, మనసారామ్, సాయిలు, అనిల్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనను కృషిచేయాలి

బాన్సువాడ రూరల్: బడీడు పిల్లలను బడిలో చేర్పించడం ద్వారా బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఏఎస్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు అయ్యాల సంతోష్‌రావు అన్నారు. అంతర్జాతీయ బాలకార్మిక నిర్మూలన దినోత్సవం సందర్భంగా గురువారం ఆయన రాజారాం దుబ్బలోని నిరుపేద కుటుంబాలకు అవగాహన కల్పించారు. ప్రభుత్వ గురుకులాలు, సంక్షేమ హాస్టళ్ల సౌకర్యాలను సద్వినియోగం చేసుకుంటూ పిల్లలకు విద్య అందించాలని వారికి సూచించారు.

మహిళల్లో రక్తహీనత నివారణకు కృషి చేయాలి



సమావేశంలో పాల్గొన్న అధికారులు

కామారెడ్డి టౌన్: మహిళల్లో రక్తహీనత నివారణకు కృషి చేయాలి జిల్లా మాతా శిశు ఆరోగ్య అధికారిణి అనురాధ అన్నారు. జిల్లా కేంద్రంలోని దేవునిపల్లి పీహెచ్‌సీలో గురువారం ఆమె జిల్లా ఫార్మసిస్టులతో ఎనీమియా ముక్త్ భారత్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. అనురాధ మాట్లాడుతూ.. జిల్లా మహిళల్లో రక్తహీనత నివారణకు సకాలంలో అన్ని పీహెచ్‌సీలకు మందులు సరఫరా అయ్యేలా చూడాలన్నారు. మందులు వాడేందుకు సప్లయ్ చైన్ మేనేజ్‌మెంట్‌పై పూర్తిస్థాయి శిక్షణ అందించారు. అధికారులు జానా బాయి, దీప్తి తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌కో లైన్‌మన్, ఆపరేటర్ సస్పెన్షన్

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని ధర్మారెడ్డి లైన్‌మన్ మన్సూర్, తాండూర్ సబ్‌స్టేషన్ ఆపరేటర్ రవిని సస్పెండ్‌చేసినట్లు ఎల్లారెడ్డి ట్రాన్స్‌కో డీఈఈ విజయసారథి గురువారం తెలిపారు. మండలంలోని తాండూర్ సబ్‌స్టేషన్ పరిధిలో గల వెంకంపల్లిలో ఈ నెల 3న ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేసే క్రమంలో క్యాజువల్ లేబర్ బోయిని యాదగిరి విద్యుదాఘాతానికి గురై తీవ్రంగా గాయపడి ఆస్పత్రి పాలయ్యాడు. కాగాలైన్‌మన్ మన్సూర్ స్థానికంగా ఉండకుండా వెంకంపల్లి ఫీడర్‌కు ఎల్‌సీ అడగడం, తాండూర్ సబ్‌స్టేషన్ ఆపరేటర్ రవి వెంకంపల్లి ఫీడర్‌కు కాకుండా ధర్మారెడ్డి ఫీడర్‌కు ఎల్‌సీ ఇవ్వడం వల్లే యాదగిరి ప్రమాదానికి గురయ్యాడని ప్రాథమికంగా తాము జరిపిన విచారణలో తేలిందని డీఈఈ తెలిపారు. దీంతో వారిని ఘటనకు బాధ్యులను చేస్తూ లైన్‌మన్, ఆపరేటర్‌ను సస్పెండ్ చేశామన్నారు. ఘటనపై పూర్తిస్థాయి విచారణ కోసం ఉన్నతాధికారులకు నివేదించినట్లు తెలిపారు.

క్రైం కార్నర్

అనుమానాస్పదస్థితిలో ఒకరి మృతి



బాన్సువాడ : పట్టణంలోని వాసవీకాలనీలో అద్దె ఇంట్లో నివాసముంటున్న గోజే రాఘవేందర్ (36) అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పిట్లం మండలం మద్దెల్‌చెర్వు గ్రామానికి చెందిన రాఘవేందర్ మూడేళ్లుగా ఓ స్టీల్ దుకాణంలో పనిచేస్తూ బాన్సువాడలో నివాసముంటున్నాడు. గుంటూరుకు చెందిన అంబికను ప్రేమించి పెద్దల అంగీకారంతో వివాహం చేసుకున్నాడు. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ నెల 9న అంబిక తన బంధువుల ప్రథమ దినకర్మకు గుంటూరుకు వెళ్లింది. పిల్లలను మద్దెల్ చెర్వులో ఉండే బావ రాజేందర్ ఇంట్లో ఉంచింది. రెండు రోజులుగా భర్త రాఘవేందర్‌కు ఫోన్ చేసినా కలవకపోవడంతో రాజేందర్‌కు సమాచారం ఇచ్చింది. దీంతో రాజేందర్ తల్లిని బాన్సువాడలోని తమ్ముడి ఇంటికి పంపగా, లోపలి నుంచి తాళాలు వేసి ఉన్న విషయం తెలిపింది. రాజేందర్ డయల్ 100కు సమాచారం ఇవ్వగా, పోలీసులు వచ్చి తలుపులు పగులగొట్టడంతో రాఘవేందర్ శవమై కనిపించాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని బాన్సువాడ ఆస్పత్రికి తరలించారు.

ఆటో బోల్తా.. పలువురికి గాయాలు



గాయపడ్డ బాలుడిని అంబులెన్సులో ఎక్కిస్తున్న మాజీ సర్పంచ్ ఫారూఖ్

గాంధారి(ఎల్లారెడ్డి): అదుపు తప్పి ఆటో బోల్తా పడడంతో ఒకే కుటుంబానికి చెందిన పలువురికి గాయాలైన ఘటన మండల పరిధిలోని మేడిపల్లి సమీపంలో గురువారం సాయంత్రం చోటు చేసుకుంది. స్థానికులు, అంబులెన్సు సిబ్బంది ఈఎంటీ సురేశ్, పైలట్ ప్రకాశ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గాంధారి మండల కేంద్రానికి చెందిన ఆరిఫ్ కుటుంబసభ్యులతో బడాపహాడ్ దర్శనం కోసం ఆటోలో బయల్దేరారు. గాంధారి- బాన్సువాడ ప్రధాన రహదారిలో బుగ్గగండి ప్రాంతంలో ఆటో అదుపు తప్పి రోడ్డు పక్కన లోయలో పడిపోయింది. దీంతో ఆటో నడుపుతున్న ఆరిఫ్‌తోపాటు అందులో ప్రయాణిస్తున్న మహిళలు, పిల్లలకు గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు, గండివేట్ మాజీ సర్పంచ్ ఫారూఖ్ 108 అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చారు. క్షతగాత్రులను లోయలో నుంచి పైకి తీసుకొచ్చి అంబులెన్సులో ఎక్కించారు. ఆరిఫ్‌తోపాటు చిన్నారులు అమ్రాన్, అర్బాన్, షరీనా, షాబీనాకు తీవ్రగాయాలు కాగా మహిళలకు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను బాన్సువాడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఘటనా స్థలంలో సహాయం చేసిన మాజీ సర్పంచ్ ఫారూఖ్‌ను పలువురు అభినందించారు.

పోలీసులకు పట్టిస్తాడనే భయంతోనే చంపేశాడు

హత్య కేసులో ఒకరి రిమాండ్

ఖలీల్‌వాడి: బైక్ దొంగతనం చేసిన తనను పోలీసులకు ఎక్కడ పట్టిస్తాడోననే భయంతో పాంగ్రా శివారులో ఒకరిని హత్య చేసిన నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు నగర సీఐ శ్రీనివాస్ రాజు తెలిపారు. నగరంలోని తన కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ వివరాలు వెల్లడించారు. నాల్గో టౌన్ పరిధిలోని సంజీవ్‌రెడ్డి కాలనీకి చెందిన వసంత్‌కుమార్ అలియాస్ టిల్లు(38), గాజులపేట్‌కు చెందిన సర్దార్ తేజసింగ్ అలియాస్ దయాసింగ్ స్నేహితులు. వసంత్‌కుమార్ ఓ ఫైనాన్స్ కంపెనీలో పని చేస్తుండగా, తేజసింగ్ జులాయిగా తిరిగేవాడు. జల్సాలకు డబ్బులు అవసరమై తేజ్‌సింగ్ ఈ నెల 7న గంగస్థాన్ ఫేస్–2లో ఓ బైక్‌ను దొంగిలించాడు. ఆ బైక్‌ను అమ్మేందుకు ఈ నెల 9న సాయంత్రం వసంత్‌కుమార్‌కు ఫోన్ చేసి రూ.25 వేలు అవసరం ఉంది, బైక్‌పై లోన్ ఇప్పించాలని అడిగాడు. దీంతో వసంత్‌కుమార్ బైక్ ఆర్‌సీ, ఆధార్ తీసుకొని వస్తే మూడు రోజుల్లో లోన్ ఇప్పిస్తానని చెప్పాడు. తేజ్‌సింగ్ బైక్ తన పేరు మీద లేదని వేరే వాళ్లదని, అర్జెంటుగా డబ్బులు కావాలని బతిమిలాడగా, బైక్‌ను తాకట్టు పెట్టుకొని రూ.3 వేలు ఇస్తానని వసంత్‌కుమార్ తెలిపాడు. దీంతో ఇద్దరూ కలిసి పాంగ్రా శివారులో మద్యం సేవించేందుకు వెళ్లారు. అక్కడ డబ్బులు ఇచ్చిన వసంత్‌కుమార్ బైక్ పేపర్లు ఇవ్వాలని తేజ్‌సింగ్‌ను అడగడంతో సరైన సమాధానం చెప్పలేదు. దీంతో అనుమానం వచ్చి దొంగిలించిన బైక్‌ను తాకట్టు పెడుతున్నావా? అని తన డబ్బులు తిరిగి ఇచ్చేయాలనడంతో తర్వాత ఇస్తానని తేజ్‌సింగ్ చెప్పాడు. దీంతో వసంత్‌కుమార్ బైక్ ఎక్కడ దొంగతనం చేశావు, పోలీసులకు చెప్తానని అన్నాడు. భయపడిన తేజ్‌సింగ్ పక్కనే ఉన్న బండరాళ్లతో తల, ముఖంపై దాడి చేయడంతో వసంత్‌కుమార్ అక్కడిక్కడే మృతి చెందాడు. 10న గుర్తు తెలియని వ్యక్తి హత్యగా కేసు నమోదు చేసుకొని సీపీ సాయి చైతన్య ఆదేశాల మేరకు ఏసీపీ పర్యవేక్షణలో దర్యాప్తు ప్రారంభించారు. మృతుడు వసంత్‌కుమార్ అలియాస్ టిల్లుగా గుర్తించి విచారణ వేగవంతం చేసినట్లు తెలిపారు. గురువారం పాంగ్రా గ్రామ శివారులో దొంగిలించిన మోటార్ సైకిల్‌పై అనుమానాస్పదంగా తిరుగుతున్న తేజ్‌సింగ్‌ను పట్టుకున్నట్లు పేర్కొన్నారు. నిందితుడి నుంచి రెండు సెల్‌ఫోన్లు, హత్యకు ఉపయోగించిన బండరాయి, బైక్ తదితర వాటిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కేసు ఛేదించిన సీఐ శ్రీనివాస్‌రాజ్, నాల్గో టౌన్ ఎస్సై కే శ్రీకాంత్, సిబ్బందిని ఏసీపీ అభినందించారు.

కుటుంబ కలహాలతో యువకుడి ఆత్మహత్య

భిక్కనూరు: మండలంలోని పెద్దమల్లారెడ్డి గ్రామానికి చెందిన యువకుడు గురువారం కుటుంబ కలహాలతో ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. గ్రామానికి చెందిన స్వర్ణబాబు(25) డబ్బుల విషయంలో తన భార్య, తల్లితో గొడవ పెట్టుకున్నాడు. దీంతో మనస్తాపం చెందిన అయన ఇంటి వద్ద ఉన్న గొర్రెల కొట్టంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కామారెడ్డి ఆస్పత్రికి తరలించారు.

నవీపేటలో మరో యువకుడు..

నవీపేట: మండల కేంద్రంలోని శివాజీనగర్ కాలనీకి చెందిన విక్కీ (25) మహంతం చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై వినయ్‌కుమార్ గురువారం తెలిపారు. ఈ నెల 9న ఇంట్లో నుంచి బయటికి వెళ్లిన విక్కీ తిరిగి రాలేదన్నారు. భార్య నాగలక్ష్మి ఫిర్యాదు మేరకు అదృశ్యం కేసు నమోదు చేశామని తెలిపారు. విచారణ చేపట్టగా కుటుంబ కలహాలతోపాటు మతిస్థిమితం లేకపోవడంతోనే విక్కీ మహంతం చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై పేర్కొన్నారు.

చోరీ కేసులో ఒకరికి ఏడేళ్ల జైలు

నిజామాబాద్ లీగల్: ధర్పల్లి మండలం దుబ్బాక ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ దొంగతనం కేసులో రెంజల్ మండల కేంద్రానికి చెందిన సంతోష్ రెడ్డికి ఏడు సంవత్సరాల జైలు శిక్ష, రూ. 3 వేల జరిమానా విధిస్తూ మొదటి అదనపు జిల్లా జడ్జి కనకదుర్గ గురువారం తీర్పు చెప్పారు. వివరాలు ఇలా ఉన్నాయి. రెంజల్‌కు చెందిన ఆలూరు సంతోష్ రెడ్డి గతంలో అనేక కేసుల్లో జైలు శిక్ష అనుభవించాడు. జైలు నుంచి విడుదలైన తర్వాత ధర్పల్లి మండలం దుబ్బాకలోని తన బంధువుల వద్ద ఉంటూ ఎలక్ట్రీషియన్‌గా పనిచేసుకోవాలని నిర్ణయించుకున్నాడు. దుబ్బాక వెళ్లిన సంతోష్ రెడ్డి తన దుర్బుద్ధిని వీడలేదు. 2024 జనవరి 1న దుబ్బాకలోని బ్యాంకు వద్ద సెక్యూరిటీ గార్డుతో సహా ఎవరూ లేకపోవడంతో బ్యాంకు దోపిడీకి పథకం వేశాడు. అందుకు తన కిట్ బ్యాగు, గడ్డపారతో బయల్దేరి బ్యాంకు షటర్‌ను ధ్వంసం చేసి లోనికి ప్రవేశించాడు. గడ్డపారతో స్ట్రాంగ్ రూం ధ్వంసం చేసేందుకు యత్నించగా మేనేజర్ బానోత్ రాజు మొబైల్‌కు సెక్యూరిటీ సిస్టం ద్వారా మెసేజ్ వచ్చింది. అప్రమత్తమైన రాజు అసిస్టెంట్ మేనేజర్‌తో కలిసి బ్యాంకు వద్ద చేరుకున్నాడు. షటర్లు ధ్వంసం చేసి ఉండడంతో పోలీసులకు సమాచారం అందించాడు. ధర్పల్లి ఎస్సై వంశీ రెడ్డి గ్రామస్తులతో కలిసి బ్యాంకు వద్దకు చేరుకొని సంతోష్ రెడ్డిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. కేసును విచారించి, సాక్ష్యాధారాలను పరిశీలించిన న్యాయమూర్తి కనకదుర్గ నిందితుడికి ఏడు సంవత్సరాల జైలు శిక్ష విధించారు. పోలీసులు తరఫున డీడీవోపీ లక్ష్మీనరసయ్య వాదించారు.

భార్యపై కోపంతో కొడుకు హత్య

- ఊపిరాడకుండా చేసి అంతమొందించిన తండ్రి



శశాంక్ మృతదేహంతో రోదిస్తున్న కుటుంబీకులు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): భార్యపై కోపంతో నాలుగేళ్ల కొడుకును ఓ తండ్రి హతమార్చిన ఘటన గురువారం నాగిరెడ్డిపేట మండలం పోచారం గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై మల్లారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పోచారం గ్రామానికి చెందిన బోయిని శ్రీహరి తన కూతురు అక్షితను ఐదేళ్ల క్రితం లింగంపేట మండలం పొల్కంపేట గ్రామానికి చెందిన నర్వ అనిల్‌కు ఇచ్చి పెళ్లి చేశాడు. వీరికి కొడుకు శశాంక్(4), కూతురు మనుశ్రీ (7 నెలలు) ఉంది. కాగా, అనిల్, అక్షిత పిల్లలతో కలిసి మంగళవారం మెదక్ జిల్లా శాలిపేట గ్రామంలో జరిగిన బోనాల పండుగ కోసం బంధువుల ఇంటికి వెళ్లారు. అక్కడ పిల్లలు ఆడుకుంటున్న క్రమంలో అనిల్ చెల్లెలు కూతురును శశాంక్ మెట్లపై నుంచి తోసేశాడు. ఈ విషయమై శాలిపేటలో గొడవ జరిగింది. తిరిగి పొల్కంపేటకు చేరుకున్న తర్వాత భార్యాభర్తలిద్దరూ గొడవ పడ్డారు. అదే సమయంలో అనిల్ తన భార్య అక్షితను కొట్టాడు. గురువారం అక్షితకు వైద్యం చేయించేందుకు పిల్లలతో కలిసి పోచారం గ్రామానికి వచ్చారు. అనంతరం కొడుకు శశాంక్‌ను బయట తిప్పుతానని చెప్పి బైక్‌పై పోచారం గ్రామశివారుకు తీసుకెళ్లాడు. శశాంక్ ముక్కు, నోరు మూసి స్పృహ కోల్పోయేలా చేసి అత్తారింటికి తీసుకువచ్చాడు. గమనించిన కుటుంబసభ్యులు శశాంక్‌ను చికిత్స నిమిత్తం మండల కేంద్రంలోని ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు బాలుడు అప్పటికే మృతి చెందాడని చెప్పారు. అనిల్‌ను నిలదీయగా భార్యపై కోపంతో తానే శశాంక్‌ను హత్య చేశానని చెప్పి పారిపోయాడు. అక్షిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.